

జనగామలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# కడియం.. ఖబడ్దార్

- ఊసరవెల్లిలా ఏ పార్టీ అధికారంలో ఉంటే అక్కడికి వెళ్తడు
- సిగ్గుంటే పదవికి రాజీనామా చేయ్
- ఇష్టమున్నట్లు కూతలు కూస్తే గోరీ కడుతం.. జాగ్రత్త
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం

జనగామ, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : 'ఊసరవెల్లిలా రంగులు మార్చి.. పొద్దుతిరుగుడు పువ్వులా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి రాజకీయ పబ్బం గడుపుకొనే కడియం శ్రీహరి, నీకు గోరీ కడతం.. జాగ్రత్త బిడ్డా.. సిగ్గుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయ్' అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేపై ఫైర్ అయ్యారు. శుక్రవారం సాయంత్రం జనగామలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం పల్లా మాట్లాడుతూ కడియం శ్రీహరి పదవి పిచ్చోడు.. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వెళ్తడు.. ఆయన బిడ్డకు ఎంపీ టికెట్ ఇస్తే పైసలతో సహా వెళ్లి మోసం చేసిండు.. గులాబీ జెండా కింద గెలిచిన నీకు ఏ మాత్రం సిగ్గు, శరం ఉన్నా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కడియం శ్రీహరిని నాయకులు, ప్రజలంతా కష్టపడి గెలిపిస్తే ఊసరవెల్లి సిగ్గుపడేలా అధికారం ఎటు ఉంటే అటు పొద్దుతిరుగుడు పువ్వులా తిరుగుతూ కేసీఆర్, కేటీఆర్, కవితపై ఇష్టం వచ్చినట్లు అవాకులు, చెవాకులు కూస్తున్నాడని మండిపడ్డారు. రాజీనామా చేసి మళ్లీ గెలవాలని.. శ్రీహరికి రెండు సార్లు అవకాశం ఇచ్చింది కేసీఆర్ కదా? నీ బిడ్డకు ఎంపీ టికెట్ ఇస్తే పైసలతో వెళ్లి మోసం చేసింది నువ్వు కాదా? అని ప్రశ్నించారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉప ఎన్నిక వస్తది.. నిన్న పాతర పెట్టడం ఖాయమని పేర్కొన్నారు. గతంలో నియోజకవర్గానికి ఏ పనులు చేయకుండా అడ్డుకున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. పదే పదే 40ఏళ్ల రాజకీయం అని చెప్పే కడియం శ్రీహరి.. ఒక్క డిగ్రీ కాలేజీ అయినా తెచ్చావా? నేను తీసుకొచ్చిన ఎత్తిపోతలకు కొబ్బరికాయ కొడ్తావా..? సిగ్గు, శరం ఉండాలి.. రాజీనామా చేసి గెలిచి అవసరముంటే అప్పుడు కొట్టు' అని పల్లా సవాల్ చేశారు. కేసీఆర్ మీద మాట్లాడే మొనగాడివి కాదు నువ్వు.. మా ప్రజల దయాదాక్షిణ్యాలు, పార్టీ జెండా కింద గెలిచావ్.. మా నాయకుల దగ్గర నుంచి టికెట్లు పొందావు.. పదవులు పొందావ్.. అధికారం అనుభవించావ్.. అని మండిపడ్డారు. ఇవ్వాల నీతులు మాట్లాడితే జాగ్రత్త బిడ్డా.. రాజకీయంగా చివరి దశకు వచ్చావు.. జాగ్రత్త అని ఎమ్మెల్యే పల్లా హెచ్చరించారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలంతా నీలాంటి ఊసరవెళ్లలకు గోరి కడతారు ఖబడ్దార్.. ఎన్నికలు దగ్గరికి వస్తున్నాయని మీటింగులు పెడుతున్నావ్.. ఏం చేశావని నీ సమావేశాలు.. ప్రజలు మిమ్మల్ని పాతర పెట్టడం ఖాయమన్నారు.

### ఏడాదిలో వెయ్యికి పైగా చెక్కులు..

ఏడాది కాలంలో దాదాపు వెయ్యికి పైగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించానని, కల్యాణలక్ష్మి చెక్కుల విషయంలో ఏ ఒక్కరోజు ఆలస్యం కాకుండా ప్రభుత్వం ద్వారా అందించామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెప్పారు. కొంతమంది రాజకీయంగా కేసీఆర్ పెట్టిన భిక్షతో ఎన్నికైన వారు కారు కూతలు కూస్తున్నారని అలాంటి వారిని ఎక్కడికక్కడ ఎండగట్టాలని కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే పల్లా పిలుపునిచ్చారు. జనగామ జిల్లా మొదటి నుంచీ ఉద్యమాలకు ఊతంగా ఉన్నదని, ఉద్యమాల్లో పాల్గొన్న వారినే ఎక్కువగా గెలిపించిందన్నారు. ఏడాది కాలంగా నాయకులు, కార్యకర్తలు ఏ విధంగా కష్టపడి పనిచేశారో అలాగే ప్రజలకు అండగా ఉండాలని కోరారు.

# పీవీఎస్ కుమార్ గుప్తాకు మహోన్నత పోలీసు సేవా పతకం

సుబేదారి, జనవరి 3 : వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న పీవీఎస్ కుమార్ గుప్తా మహోన్నత పోలీసు సేవా పతకానికి ఎంపికయ్యారు. 1991 బ్యాచ్‌కు చెందిన గుప్తా పోలీసు శాఖలో 34 సంవత్సరాలుగా సేవలందిస్తూ 2002లో ఉగాది పోలీసు సేవా పతకం, 2018లో ఉత్తమ సేవా పతకం అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరోసారి 2025 సంవత్సరానికి పోలీస్ మహోన్నత సేవా పతకానికి ఎంపిక చేసింది.


హెడ్ కానిస్టేబుల్ గుప్తా

### రేజింగ్ కాంట్రాక్టర్ తీరు తోనే విభేదాలా?

ఇసుక క్వారీ గ్రామ సభ ఆమోదం కోసం చక్రం తిప్పి గ్రామస్తులను ప్రసన్నం చేసుకున్న రేజింగ్ కాంట్రాక్టర్ ఒప్పందం ప్రకారం వారికి సహకరించకుండా ఒక వర్గం వారితోనే సఖ్యతతో ఉండడమే విభేదాలకు కారణమై ఉంటుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇతనితో పాటు కొందరు నేతల వ్యవహార శైలితోనే విబేధాలు మొదలై విడిపోయి ఇసుక క్వారీ రద్దు చేయాలని కోరే వరకు వెళ్లినట్లు తెలుస్తున్నది. అయితే మూడు గ్రామాల ప్రజలు ఇసుక క్వారీ రద్దు కోసం ఉన్నతాధికారులను త్వరలో కలువనున్నట్లు తెలిసింది. ఈవిషయంపై వాజేడు ఎంపీవో శ్రీకాంత్‌నాయుడును వివరణ కోరగా ఇసుక క్వారీ సొసైటీలపై అధికారం భద్రాచలం ఐటీడీఏ పీవోకు మాత్రమే ఉంటుందన్నారు. వారిని కలిసి వినతిపత్రం ఇస్తే ప్రయోజనం ఉంటుందన్నారు.


చెరుకురు గ్రామంలోని రైతువేదికలో డిసెంబర్ 19 తేదిన పీసా గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

# పల్లెల్లో ఇసుక క్వారీ చిచ్చు

- తమ పేర్లు సొసైటీ జాబితాలో లేవని, క్వారీ రద్దు చేయాలంటున్న మూడు గ్రామాలు
- కొనసాగించాలని మరో గ్రామం..
- ఎంపీడీవోకు వినతిపత్రాల అందజేత
- రేజింగ్ కాంట్రాక్టర్‌తో ఒప్పందమే విభేదాలకు కారణమా?

వాజేడు, జనవరి3: పల్లెల్లో ఇసుక క్వారీ సొసైటీ చిచ్చుపెట్టింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చెరుకురు గ్రామపంచాయతీ పరిధిలో చెరుకురు, బయ్యారం, రేగులపాడు, మోతుకుల గూడెం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలో ఇటీవల ఇసుక క్వారీ మంజూరు కావడంతో అధికారులు డిసెంబర్ 18న చెరుకురు రైతు వేదిక వద్ద ఇసుక క్వారీ అనుమతి కోసం పీసా గ్రామసభ నిర్వహించగా మెజార్టీ సభ్యులు మాజరుకాకపోవడంతో మరుసటి రోజుకు వాయిదా వేశారు. క్వారీ నిర్వహించబోయే బినామీ రేజింగ్ కాంట్రాక్టర్‌తో పాటు కొందరు స్థానిక నాయకులు చక్రం తిప్పి గ్రామస్తులను ప్రసన్నం చేసుకొని గ్రామసభ ఆమోదం కోసం మెజార్టీ ఓటర్లను తరలించే ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో డిసెంబర్ 19 తేదీన నిర్వహించిన పీసా గ్రామసభకు 501 మంది గిరిజన ప్రజలకు 210 మంది హాజరై ఇసుక క్వారీ నిర్వహణకు అంగీకారం తెలిపినట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో పోశమ్మ ఆదివాసీ మహిళా ఇసుక సొసైటీ క్వారీలో తమను సభ్యులుగా చేర్చుకుంటామని చెప్పి ఇప్పుడు మాట తప్పుతున్నందున దాన్ని రద్దు చేయాలని డిసెంబర్ 30 తేదీన బయ్యారం, రేగులపాడు, మోతుకులగూడెం గ్రామాల గిరిజనులు, జనవరి 2వ తేదీన చెరుకురు గ్రామానికి చెందిన ఇసుక సొసైటీ సభ్యులు, గ్రామస్తులు క్వారీ కొనసాగించాలని ఎంపీడీవో విజయకు వినతిపత్రాలు అందించారు. ఒకే గ్రామపంచాయతీలో ఇన్నాళ్లు కలిసి మెలిసి ఉన్న నాలుగు గ్రామాల ప్రజల మధ్య ఇసుక క్వారీ చిచ్చుపెట్టినట్లయ్యింది.

# సీఎం సానుభూతి కోసమే కడియం విమర్శలు

**స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య**



స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 3 : సీఎం రేవంత్‌రెడ్డి సానుభూతి పొందేందుకే ఎమ్మెల్యే కడియం శ్రీహరి కేసీఆర్ కుటుంబంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. గురువారం ఆయన జనగామ జిల్లా చిల్పూర్ మండలంలో జరిగిన ఓ కార్యక్రమంలో మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీలో మంత్రి పదవులు అనుభవించి, బీఆర్ఎస్‌లో కేసీఆర్ పుణ్యమా అని ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు ఎన్నో పదవులు చేపట్టి, పదేళ్లు కేసీఆర్‌ను కుటుంబాన్ని పొగిడిన నోటితో మళ్లీ ఎలా విమర్శిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టు ప్రపంచంలో ఎక్కడా లేదన్నావు.. కేసీఆర్ మానసపుత్రిక అని మాట్లాడిన నీవు, కాళేశ్వరం ప్రాజెక్టు కమీషన్ల ప్రాజెక్టు అనడం సరైనదేనా?, లిక్కర్ కేసులో కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ స్టేషన్‌ఘన్‌పూర్ జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులతో ధర్నా చేసింది నువ్వు కాదా? అని రాజయ్య ప్రశ్నించారు. బీఆర్ఎస్ కండువాతో గెలిచిన నీవు కాంగ్రెస్‌లో చేరగానే కేసీఆర్ కుటుంబం అవినీతిమయంగా కనిపిస్తుందా? అని విమర్శించారు. టీడీపీలో, బీఆర్ఎస్‌లో మంత్రి పదవులు అనుభవించి ఎన్నో అక్రమ ఆస్తులు కూడబెట్ట లేదా?, 1994కు ముందు ఉన్న ఆస్తులు ఎన్ని? ఇప్పుడు ఉన్న ఆస్తులు ఎంత అని ప్రశ్నించారు. ఇంకోసారి కేసీఆర్ కుటుంబం గురించి మాట్లాడితే ఖబడ్దార్ అని రాజయ్య హెచ్చరించారు.




# సమాజంలో పోలీసుల పాత్ర కీలకం

- సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి
- ఏసీబీ డైరెక్టర్ డాక్టర్ తరుణ్‌జోషి
- మామునూర్ బెటాలియన్‌లో కానిస్టేబుల్ పాసింగ్ అవుట్ పరేడ్

కరీమాబాద్, జనవరి 3 : సమాజంలో పోలీసుల పాత్ర చాలా కీలకమని ఏసీబీ డైరెక్టర్ డాక్టర్ తరుణ్‌జోషి అన్నారు. శుక్రవారం మామునూరులోని 4వ బెటాలియన్‌లో కమాండెంట్ రామ్ ప్రకాశ్ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్ పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తరుణ్‌జోషి మాట్లాడుతూ ప్రజలకు రక్షణగా నిలుస్తూ మెరుగైన సేవలను అందిస్తూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ఆటుపోట్లను అధిగమించి ఉద్యోగాలను పొందడం హర్షణీయమన్నారు. ఉన్నత స్థానంలో ఉన్న వారిని ఆదర్శంగా తీసుకుంటూ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. 453 మంది తొమ్మిది నెలల పాటు శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. పాసింగ్ అవుట్ పరేడ్‌కు రావడం సంతోషంగా ఉన్నదన్న ఆయన విధుల్లో రాణించి పోలీసు శాఖకు, ఊరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్లు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. తమ బిడ్డలను ఖాకీ దుస్తుల్లో చూసి అక్కడకు వచ్చిన తల్లిదండ్రుల ముఖాల్లో సంతోషం వెల్లివిరిసింది. కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా, పీటీసీ ప్రిన్సిపల్ పూజ పాల్గొన్నారు.

## కెనాల్‌కు బాట ఇవ్వలేదని
# కుల బహిష్కరణ

- పెద్దమనుషుల తీరుతో మహిళ ఆత్మహత్యాయత్నం
- దారి విషయంలో ఏకపక్ష నిర్ణయంపై మనస్తాపం
- ఆరుగురు కుల పెద్దలు, మరో వ్యక్తిపై కేసు నమోదు
- హనుమకొండ జిల్లా కొండపర్తిలో ఘటన

ఐనవోలు, జనవరి 3 : మహిళ ఆత్మహత్యాయత్నం ఘటనలో ఆరుగురు పెద్దమనుషులు, మరోవ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తి గ్రామానికి చెందిన యాదవ కులస్తుడు నాయిని చిన్న కొమురయ్యకు సుమారు ఐదెకరాల భూమి ఉంది. కొడుకులు లేకపోవడంతో కూతురు అనిత, అల్లుడు ఐలయ్య ఇల్లరికం ఉంటున్నారు. కొమురయ్య భూమి నుంచి కెనాల్ పోవడంతో బాట సమస్య ఏర్పడింది. దీంతో తన భూమికి ముందున్న రైతుతో పెద్దమనుషుల సమక్షంలో గుంటకు మూడు గుంటల భూమి ఇవ్వాలని ఒప్పందం చేసుకొని బాటను తీసుకున్నాడు. అయితే, ఆయన భూమి వెనక ఉన్న బీనబోయిన రమేశ్ కొమురయ్య భూమి నుంచి బాట కోసం పెద్దమనుషులను ఆశ్రయించాడు. వారు రమేశ్ గుంటకు గుంట భూమి మాత్రమే ఇస్తాడని నిర్ణయం చేయడంతో కొమురయ్య వారి మాట వినలేదు. దీంతో ఆయన కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరించారు. కాగా, గురువారం పెద్దమనుషులు కొమురయ్య భూమిలో హద్దురాళ్లు నాటు తుండగా, అక్కడే ఉన్న కొమురయ్య బిడ్డ అనిత.. మా కుటుంబానికి ఎందుకు అన్యాయం చేస్తున్నారని అడుగగా పరుష పదజాలంతో దూషించారు. దీంతో మనస్తాపం చెందిన అనిత పురుగుల మందు తాగి ఆత్యహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించగా, ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కొమురయ్య ఫిర్యాదు మేరకు ఆరుగురు పెద్దమను షులు నాయిని పెద్ద ఐలయ్య, నాయిని దశరథం, జైకాని సాయిలు, కొడాలి భిక్షపతి, నాయిని కనకసేన, బైకాని పెద్దరాజు, పక్క భూమి రైతు రమేశ్‌పై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

### లేకుంటే నిరవధిక దీక్ష చేస్తా..

- నిరుపేదలపై ఎమ్మెల్యే గండ్ర మొండివైఖరి వీడాలి
- గెలిచి 13 నెలలైనా లబ్ధిదారులకు ఎందుకివ్వడం లేదు?
- నిరసన దీక్షలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

# డబుల్ ఇళ్ల పట్టాలివ్వాల్సిందే..

కృష్ణ కాలనీ, జనవరి 3: గతంలో ఎంపిక చేసిన 392 మంది డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు సోమవారంలోగా పట్టాలివ్వాలని, లేకుంటే అంబేద్కర్ సెంటర్‌లో నిరవధిక దీక్ష చేస్తానని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ అధ్యక్షతన నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుపేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో వేశాలపల్లి, భాస్కర్ గడ్డలో 955 నిర్మించి కలెక్టర్ సమక్షంలో 392 మందిని ఎంపిక చేశామన్నారు. నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వారికి పట్టాలివ్వకుండా నిర్లక్ష్యం చేయడం సిగ్గుచేటు అన్నారు. ఇండ్ల కోసం లబ్ధిదారులు ధర్నా చేస్తే పోలీసులు వారికి ప్రభుత్వ పథకాలు రావని బెదిరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు వచ్చి 13 నెలలు పూర్తవుతున్నా ఇండ్లు ఇవ్వకపోవడంలో ఆంతర్యం ఏమిటో కలెక్టర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే ఎమ్మెల్యే ఓ వెయ్యి కొత్త ఇండ్లు తీసుకువచ్చి నిరు పేదలకు కట్టించాలన్నారు. బెదిరించి పార్టీ కండువాలు కప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ నీచ రాజకీయానికి నిదర్శనమని పేర్కొన్నారు. లగచర్లలో గిరిజన రైతుల భూములను లాక్కోవాలని ప్రభుత్వం చూస్తే, రైతులు, వారికి మద్దతుగా నిలిచిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించిన నీచుడు సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక్క పిల్లర్ డ్యామేజైతే ఇప్పటి వరకు దానిని రిపేరు చేయించ లేదని, హామీలపై అడిగితే డైవర్షన్ రాజకీయాలు చేస్తు న్నాడని విమర్శించారు. ఎమ్మెల్యేకు దమ్ముంటే బైపాస్ రోడ్డు పనులు ప్రారంభించాలన్నారు. మంతులు శ్రీధర్ బాబు, శ్రీనివాస రెడ్డి చొరవ తీసుకొని జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ తీసుకురావాలని, గతంలో ఎంపి క చేసిన లబ్ధిదారులకు వెంటనే ఇండ్ల పట్టాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, నిరసన దీక్షకు టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేశ్ మాదిగ, ప్రధాన కార్యదర్శి పుల్ల సతీశ్ మాదిగ, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి శీలపాక హరీశ్ మాదిగ మద్దతు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ నూనె రాజు పటేల్, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్ యాదవ్, జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ, బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు కొత్త హరిబాబు, మంగళపల్లి తిరుపతి, మేకల రజిత, బానోత్ రజిత, ఎడ్ల మౌనిక, దార పూలమ్మ, బద్ది సమ్మయ్య, ఆకుదారి మమత, యూత్ అర్బన్ అధ్యక్షుడు బుర్ర రాజు, బీఆర్ఎస్ నాయకులు కళ్లెపు రఘుపతి రావు, మండల విద్యాసాగర్ రెడ్డి, బీబీ చారి, చిరంజీవి, పోలవేణి అశోక్, శ్రీకాంత్ పటేల్, మామిడి కుమార్, దొంగల ఐలయ్య, యుగేంద్రాచారి, ప్రేమ్‌కుమార్, సంకటి మొగిలి, శ్రీనివాస్, మహేందర్, లట్ట రాజబాబు, గండ్ర యువసేన నాయకులు పాల్గొన్నారు.


### 13 నెలల నుంచి తిరుగుతున్నం



నాకు ఇల్లు లేదు. నా భర్త ఆనారోగ్యంతో బాధపడుతున్నాడు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇల్లిస్తే కాంగ్రెస్ ప్రభు త్వం పట్టాలు ఎందుకిస్తలేదు. 13 నెలల నుంచి ఇం డ్ల పట్టాలివ్వాలని ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇండ్ల కోసం ధర్నా చేస్తుంటే పోలీసులు ఫోన్ చేసి మీకు డబుల్ బెడ్ రూమ్‌లు, ఏ ప్రభుత్వ పథకాలు రావని బెదిరిస్తున్నారు. ఎమ్మెల్యే మొండివైఖరిని వీడి ఇండ్లకు పట్టాలివ్వాలి.

– కోసరి రజిత, డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారు

### వచ్చేసారి రమణన్నే గెలవడం ఖాయం



ఎమ్మెల్యేగా వచ్చేసారి గండ్ర వెంకటరమణారెడ్డి గెలవడం ఖాయం. ఏడాదికే భూపాలపల్లిలో కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయింది. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ కార్యకర్తలకు ఇండ్లు ఇవ్వాలనుకుంటే ప్రభుత్వంతో మాట్లాడి మరో 500 ఇండ్లు నిర్మించి ఇవ్వాలి. గత ప్రభుత్వం తమకు కేటాయించిన ఇండ్ల పంపిణీకి అడ్డుపడడం సరైంది కాదు.

– జీ నీలాంబరం, లబ్ధిదారుడు, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

## ఒకే ఊరిలో టార్పాలిన్లతో 100 ఇండ్లు!

**గోవిందాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే యాప్‌లో నమోదు**

- విస్తుపోయిన అధికారులు
- పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేసిన కలెక్టర్

శాయంపేట, జనవరి 3 : హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని గోవిందాపూర్ గ్రా మంలో టార్పాలిన్ కప్పుకున్న పెంకుటిళ్లే అధికంగా ఉన్నాయని ఇందిరమ్మ ఇండ్ల సర్వే యాప్ లో పంచాయతీ కార్యదర్శి నమోదు చేయడంతో అధికారులు విస్తుపోయారు. వివరాలిలా ఉన్నాయి. గోవిందాపూర్ గ్రామంలో 198 ఇందిరమ్మ దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి వాళ్ల ఇల్లు స్లాబ్, రేకులు, టార్పాలిన్ కప్పిన పెంకుటిల్లుగా గుర్తించి ఫొటో తీసి యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. గోవిందాపూర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఏకంగా 100 ఇండ్లు టార్పాలిన్ కప్పుకొని ఉన్న పెంకుటిండ్లుగా నమోదు చేశారు. దీంతో అధికారులు అనుమానాలు వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజేందర్, స్థానిక ఎంపీడీవో ఫణిచంద్ర, హౌసింగ్ ఏఈలను ఉన్నతాధికారులు రంగంలోకి దించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి అప్లోడ్ చేసిన 100 టార్పాలిన్ కప్పిన పెంకుటిండ్లను ఒక్కొక్కటిగా పరిశీ లించారు. ఇందులో కేవలం మూడు మాత్రమే టార్పాలిన్లు కప్పిన పెంకుటిండ్లుగా తేలింది. మిగతావి స్లాబులు, రేకులు ఉన్నట్లు గుర్తించారు. పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం చేశారని గుర్తించి కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. వారం రోజుల్లో సమాధానం చెప్పాలని ఆదేశించా రు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.


నెల్లికుదురు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ ఇరువర్గాలు

# వాళ్లకేనా పనులు.. మాకేవి?

- పనులిస్తలేరు.. ఎమ్మెల్యే సమాచారమిస్తలేరు
- నెల్లికుదురు కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గపోరు

నెల్లికుదురు, జనవరి 3: కాంగ్రెస్‌లో మరోసారి వర్గపోరు బయటపడింది. ఒక వర్గానికి చెందిన కార్యకర్తలకే ఈజీఎస్ పనులు ఎలా ఇస్తారని మరో వర్గం నాయకులు వాగ్వాదానికి దిగిన ఘటన శుక్రవారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్ శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో కాస్యతండా, బంజర గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి, అక్కడినుంచి నెల్లికుదురు కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చారు. నెల్లికుదురులో ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున ఇద్దరు కార్యకర్తలకు సీసీరోడ్ల పనులు ఇచ్చారు. దీంతో ఓ వర్గం కార్యకర్తలు మరో వర్గం వారితో వాగ్వాదానికి దిగారు. ఆ ఇద్దరికే పనులు ఎలా ఇస్తారు? పార్టీ బలోపేతానికి పాటు పడే కార్యకర్తలను విస్మరిస్తున్నారని, ఎమ్మెల్యే వచ్చే సమాచారమే ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే వచ్చే సమాచారం కొద్దిమంది నాయకులు, కార్యకర్తలకే పరిమితమవుతున్నదని ఇరువర్గాలు వాదనకు దిగాయి.

# ఇందిరమ్మ ఇండ్ల సర్వే గందరగోళం

- జాబితాలో పేర్లు లేక ఆందోళనలో పేదలు
- బల్దియా చుట్టూ తిరుగుతున్న బాధితులు

వరంగల్, జనవరి 3 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్ల పథకం సర్వే గందరగోళంగా మారింది. అర్హులైన వారి పేర్లు సర్వే జాబితాలో లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసిన ఫారాలతో బల్దియా చుట్టూ తిరుగుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో అప్పుడు అధికారులు చేసిన తప్పిదాలు ఇప్పుడు అర్హులైన పేదలకు శాపంగా మారాయి. విద్యార్థులతో ఆదరబాదరాగా ఆన్‌లైన్ చేయించడంతో అనేక తప్పిదాలు జరిగాయన్న ఆరోపనలు అప్పట్లో వెల్లువెత్తాయి. అవే దరఖాస్తుల ప్రకారం సర్వే చేపట్టడంతో చాలా మంది పేర్లు జాబితాలో లేకుండా పోయాయి. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నామని సర్వే సిబ్బందితో బాధితులు మొరపెట్టుకోగా తామేమీ చేయలేమని వారు చేతులెత్తేస్తున్నారు. దీంతో బాధితులు కార్పొరేషన్ కార్యాలయానికి పరుగులు పెడుతున్నారు. అక్కడ బాధితులకు సమాధానం చెప్పేవారు లేకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. ప్రభుత్వం అవకాశం కల్పిస్తే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సిబ్బంది చెబుతున్నారు. అధికారులు చేసిన తప్పుకు తమకు అన్యాయం జరగడమేంటని బాధితులు నిలదీస్తున్నారు. పేర్లు నమోదు కానివారి కోసం ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలని కోరుతున్నారు.

